

జల వనరుల బకాయిలు రూ.389.12 కోట్లు

- ప్రభుత్వానికి నివేదిక
- కాలువల నిర్వహణ కోసం రూ.20 కోట్లతో ప్రతిపాదనలు
- ఉత్తరాంధ్ర చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు
- ఈ ఏడాది ఖరీఫ్‌లో 6.18 లక్షల ఎకరాలకు సాగునీరు

... 7వ పేజీలో

భావితరాలకు స్ఫూర్తి అల్లూరి

సీతారామరాజు స్మారక ప్రాంతాల అభివృద్ధి అవశ్యం
స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

- ఘనంగా అల్లూరి జయంతి
- అల్లూరి, గంటందొరల సమాధుల వద్ద నివాళి



కృష్ణాదేవిపేటలో అల్లూరి, గంటందొరల సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, తదితరులు

కృష్ణాదేవిపేట, జూలై 4: భావితరాలకు స్ఫూర్తిగా అల్లూరి సీతారామరాజు స్మారక ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి సమాధులున్న పార్కులో గురువారం అల్లూరి 127వ జయంతి సందర్భంగా అల్లూరి, గంటందొరల సమాధులకు, విగ్రహాలకు అయ్యన్నపాత్రుడుతో పాటు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అల్లూరి తన కుటుంబం కంటే దేశ సేవ గొప్పదిగా బ్రిటీష్ పాలకులపై తిరుగుబాటు చేసి చిన్న వయస్సులో స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. యువత డ్రగ్స్, గంజాయిబారిన పడి చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోతున్నారని, వీటి నిర్మూలనకు ఉక్కుపాదం మోపాలన్నారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ అల్లూరి చరిత్ర ఎంతో మంది యువతకు ఆదర్శమన్నారు. అల్లూరికి యుద్ధ విద్య, మూలికల వైద్యం, గెరిల్లా పోరాటంలో నైపుణ్యం, మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని కొనియాడారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ అల్లూరి ప్రధాన అనుచరులు గంటందొర, మల్లు దొర కుటుంబీకులకు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో గృహ నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ ప్రాంత ఎన్‌సీసీ విద్యార్థులకు హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాంపు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడికి ఆయన వినతి పత్రం అందజేశారు. అలాగే పార్కులో చదువుకునే నిరుద్యోగ యువతకు కాంపిటేటివ్ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందించాలని వేపాడ చిరంజీవిరావు కోరగా, త్వరలో అందిస్తామని అయ్యన్న తెలిపారు. పాడుతా తీయగా విన్నర్ దీరజ్ ఈ సందర్భంగా మేజర్ చంద్రకాంత్ సినిమాలోని పుణ్యభూమి నాదేశం పాట పాడారు. పార్కులో విద్యార్థులు, కళాకారులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బదిలీపై వెళుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని అయ్యన్నపాత్రుడు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డీపీవో శిరీషారాణి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి వి.నాగశిరీషా, ఆర్‌డీవో జయరాం, జిల్లా అటవీఅధికారి లక్ష్మణ్, గ్రామ సర్పంచ్ లోచల సుజాత, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ మండలాధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, ఎంపీటీసీ రామకృష్ణ, చోద్యంసర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, జనసేన నాయకుడు రాజాన సూర్యచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేట పార్కులో అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పేదింటి కల నెరవేర్చలేకపాయె!

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగని పనులు

- జగనన్న కాలనీల్లో సగం కూడా పూర్తి కాని ఇళ్ల నిర్మాణాలు
- లబ్ధిదారులు అప్పులు చేసి పనులు చేపట్టినా బిల్లులు మంజూరు చేయని వైనం
- ఐదేళ్ల పాటు ప్రచార ఆర్భాటానికే పరిమితం



అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో బేస్‌మెంట్ దశలో నిలిచిన గృహ నిర్మాణ పనులు

కూటమి ప్రభుత్వంపైనే జనం ఆశలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జగనన్న కాలనీల ఏర్పాటుతో పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇస్తామన్న గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయి. నవరత్నాలు, పేదలందరికీ సొంతిల్లు కల నేర్చడంలో వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించకపోవడం, అధికారుల నిర్లక్ష్యం వెరసి.. జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ పడకేశాయి. లబ్ధిదారులు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టానా చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, నిర్మాణ సామగ్రి అందకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. చాలాచోట్ల అసలు పునాదులే పడకపోగా, కొన్నిచోట్ల మొండిగోడలు, అరకొర నిర్మాణాలతో జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి.

పేదల ఇళ్ల నిర్మాణాల విషయంలో ఐదేళ్లుగా ప్రచార ఆర్భాటం చేసిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు వరకు జిల్లాలో కనీసం సగం లక్ష్యాలను చేరుకోలేకపోయింది. ఇంతలో ఎన్నికలు రావడంతో గత ఏప్రిల్ నెల నుంచి పేదల ఇళ్ల నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రావడంతో తమ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తవుతాయని లబ్ధిదారులు ఆశతో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ సంస్థ అందించాల్సిన సిమెంట్, ఇసుక, ఇనుము సకాలంలో పంపిణీ చేయకపోవడం, చేసిన పనికి బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పుల ఊబిలో మునిగిపోయామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రూ.1.8 లక్షలు ఇంటి నిర్మాణానికి ఏమూలకు చాలకపోయినా సొంత ఇల్లు నిర్మించుకోవాలనే తాపత్రయంతో అనేకమంది పేదలు అవస్థలుపడి మరీ ... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే పనులు చేపడతాం



జిల్లాలో ప్రస్తుతం గృహ నిర్మాణ పనులు జరగని మాట వాస్తవమే. ప్రస్తుతం జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాల స్థితిగతుల సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కొనసాగింపుపై మార్గదర్శకాలు ఇంకా విడుదల చేయలేదు. గత ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ పనులు ఎన్నికల ముందు నిలిచిపోయాయి. లబ్ధిదారులకు బకాయిలు ఉన్నందున పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల కాగానే గృహ నిర్మాణ పనులు పూర్తి చేస్తాం.

- శ్రీనివాసరావు, పీడీ, గృహ నిర్మాణ సంస్థ, అనకాపల్లి

శభాష్ సుందరపు



విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడంతో సెల్‌ఫోన్ టార్చి వేసుకుని మండల సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

- మండల సమావేశం నిర్వహిస్తున్నప్పుడు రెండు సార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం
- అధికారులపై అసహనం వ్యక్తం చేయకుండా సెల్‌ఫోన్ టార్చి వెలుతురులో సమావేశం కొనసాగించిన ఎమ్మెల్యే
- విజయకుమార్ తీరుకు పలువురి అభినందన

ఎలమంచిలి, జూలై 4: విద్యుత్ సరఫరాకు రెండు సార్లు అంతరాయం కలిగినా అధికారులపై అసహనం వ్యక్తం చేయకుండా సెల్‌ఫోన్ టార్చి వెలుతురులో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మండల సమావేశం నిర్వహించడం అందరి మన్ననలు అందుకుంది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం జరుగుతున్న సమయంలో రెండుసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయినా విద్యుత్ అధికారులపై ఎమ్మెల్యే ఎటువంటి అసహనం వ్యక్తం చేయకుండా సెల్‌ఫోన్ టార్చి వెలుతురులో సమావేశాన్ని కొనసాగించారు. ఆయన తీరును పలువురు అభినందించారు.

కంప్యూటర్ సైన్స్‌కే డిమాండ్

పేరొందిన రెండు ప్రైవేటు కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీటు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షలు

- మరో రెండింటిలో రూ.3 లక్షలు-రూ.4 లక్షలు
- పొరుగు జిల్లా కళాశాలలో రూ.5 లక్షలు
- వీటికి ఫీజులు అదనం
- ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం
- ఏయూలోని రెండు కళాశాలల్లో 900 ఇంజనీరింగ్ సీట్లు
- 21 ప్రైవేటు కళాశాలలలో 17,190



విశాఖపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి):

ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌కు డిమాండ్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఐటీ సెక్టార్‌లో సంక్షోభం ఉన్నప్పటికీ మెజారిటీ విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ గ్రూపులోనే చేరేందుకు మొగ్గుచూపుతున్నారు. లక్షలు పోసైనా పేరున్న కళాశాలలో సీటు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నారు. నగర శివారుల్లోని రెండు కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాలో కంప్యూటర్ సైన్స్ సీటు కావాలంటే రూ.ఆరు లక్షల నుంచి ఏడు లక్షల వరకూ చెల్లించాలి. మరో రెండు కళాశాలలు మూడు లక్షల నుంచి నాలుగు లక్షలు చెబుతున్నాయి. పొరుగు జిల్లాలో మరో కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సీటు రూ.ఐదు లక్షలు పలుకుతుంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ పరిధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రెగ్యులర్, మహిళా కళాశాలల్లో కలిపి 900 సీట్లు, 21 ప్రైవేటు కళాశాలల్లో 17,190

ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్ సీట్లు 18,090

సీట్లు...మొత్తం 23 కళాశాలల్లో 18,090 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా ఆంధ్ర విశ్వవిద్యాలయం రెగ్యులర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీలో 60 సీట్లకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది.



రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ నిర్వహించిన ఈఏపీసెట్ (ఎంసెట్)లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ప్రారంభమైంది. టాపర్లు పలువురు జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్‌లో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించి ఉంటారు. అటువంటి వారంతా ఐఐటీ/ఎన్ఐటీ/తత్సమాన జాతీయ విద్యాసంస్థల్లో చేరతారు. అక్కడ సీట్లు రాని విద్యార్థులు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల, నగర శివారుల్లోని నాలుగు, పొరుగు జిల్లాలోని ఒక ప్రైవేటు కళాశాలలో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ కూడా కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరేందుకు ఇష్టపడుతున్నారు. ఏయూలో కంప్యూటర్ సైన్స్, ఐటీల్లో సీటు రాకపోతే ప్రముఖ ప్రైవేటు కళాశాలలో అదే కోర్సులో చేరడానికి మొగ్గు చూపుతున్నారు. అయితే మెరుగైన ర్యాంకులు రాని విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం యత్నిస్తున్నారు. ఆర్థికంగా స్థోమత ... మిగతా 8వ పేజీలో

ఏకోనిరంజన్

- మండలంలోని గుడ్డిప కొత్తూరు, ఎల్ఎన్ పురం ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మాత్రమే..
- పది మందిలోపు స్కూళ్లు మరికొన్ని..
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల విలీనంతో ఇబ్బందులు



గుడ్డిప కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో ఒక్క విద్యార్థికే పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయిని

రావికమతం, జూలై 4: గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలల విలీనంతో మండలంలోని గుడ్డిప కొత్తూరు, తట్టబంద పంచాయతీ శివారు ఎల్ఎన్ పురం ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్క విద్యార్థి మాత్రమే ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చాలా మంది విద్యార్థులు చదువుకు దూరం కావడం, కొందరు ప్రైవేటు పాఠశాలల్లో చేరడంతో ఈ పరిస్థితి నెలకొంది.

మండలంలో 51 ప్రాథమిక పాఠశాలలు, 9 యూపీ స్కూళ్లు, 9 జడ్పీ హైస్కూళ్లు, ఒక కేజీబీవీ, ఒక ఏపీ మోడల్ స్కూల్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఏటా సుమారు ఐదు వేలు నుంచి ఆరు వేల మంది వరకు చదువుతుంటారు. అయితే రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 117తో ప్రాథమిక పాఠశాలలను సమీప పాఠశాలల్లో కొన్నింటిని విలీనం చేశారు. దీంతో మండలంలో గుడ్డిప కొత్తూరు, తట్టబంద పంచాయతీ శివారు ఎల్ఎన్ పురం ప్రాథమిక పాఠశాలలో ఒక్కటి, రెండు తరగతులకు గాను గత రెండేళ్లుగా ఒక్కొక్క విద్యార్థి మాత్రమే ఉన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ పాఠశాలలో ముగ్గురు, మత్స్య వానిపాలెం, కన్నంపేట, శ్రీరామనగర్ కాలనీ పాఠశాలల్లో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. గర్నికం పంచాయతీ శివారు కానాడ ప్రాథమిక పాఠశాలలో తొమ్మిది మంది విద్యార్థులు ఉన్నారు. విలీనం ప్రక్రియతో మండలంలో 20 మంది విద్యార్థులు లోపు ఉన్న పాఠశాలలు మరికొన్ని ఉన్నాయి. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతూనే ఉంది. కూటమి ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు సర్వే పనుల అడ్డగింత

- గిరిజనులతో సిబ్బంది వాగ్వాదం
- సర్వే సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఆదివాసీలు





సర్వే పనులను అడ్డుకుంటున్న గిరిజనులు, స్వాధీనం చేసుకున్న సామగ్రి

దేవరాపల్లి, జూలై 4: అనంతగిరి మండలం సరియా జలపాతం సమీపంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం అదానీ కంపెనీ సిబ్బంది చేస్తున్న సర్వేను గురువారం గిరిజనులు అడ్డుకున్నారు. జిల్లా అటవీ అధికారుల అనుమతులతోనే ఇక్కడ సర్వే చేస్తున్నామని గిరిజనులతో సిబ్బంది వాగ్వాదానికి దిగారు. అయితే సర్వేకు ఉపయోగించే సామగ్రిని గిరిజనులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామసభ నిర్వహించి పంచాయతీ తీర్మానం తీసుకోవలసి ఉన్నప్పటికీ కంపెనీ ప్రతినిధులు ఇవేవీ పాటించడం లేదని గిరిజనులు మండిపడ్డారు. పనులు నిలిపి వేయకపోతే ప్రతిఘటిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న హెచ్చరించారు. కోనాం జలాశయం, వాలాబు గిరిజన పంచాయతీ, సరియా పరిసర ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు వల్ల తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర, గిరిజనులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం దేశ వ్యాప్తంగా చేసిన బంద్ జిల్లాలో విజయవంతమైంది. ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌వో విద్యార్థి సంఘాల నాయకులు అనకాపల్లిలో అన్ని విద్యాసంస్థలకు వెళ్లి నిరసనలు తెలిపారు. - వార్త 7వ పేజీలో..

ఉపాధి పనుల్లో అవకతవకలు

నామవరం గ్రామసభలో వెల్లడించిన సోషల్ ఆడిట్ అధికారులు

- 7లో

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి వడ్డాది వాసి మృతి


దొండా సన్యాసిరావు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, జూలై 4: అనకాపల్లి నుంచి హైదరాబాదు రైలులో ప్రయాణిస్తున్న వడ్డాదికి చెందిన దొండా సన్యాసిరావు(62) ప్రమాదశాత్తూ జారిపడి మృతి చెందాడు. సన్యాసిరావు సోమవారం ఉదయం జన్మభూమి రైలులో అనకాపల్లి నుంచి హైదరాబాద్ వెళుతున్నారు. సామర్లకోట సమీపంలో రైలు పట్టాల పక్కన సన్యాసిరావు మృతదేహం పడి ఉండడాన్ని మంగళవారం ఉదయం రైల్వే పోలీసులు గుర్తించారు. ప్రమాద శాత్తూ రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావించారు. భర్త హైదరాబాద్ చేరుకోకపోవడంతో బుధవారం భార్య అమ్మాజీ.. సన్యాసిరావు సెల్‌కి ఫోన్ చేయగా, రైల్వే పోలీసులు ఈ విషయాన్ని తెలిపారు. దీంతో కుటుంబీకులు సామర్లకోట చేరుకుని, శాఖాపరమైన చర్యల అనంతరం గురువారం మధ్యాహ్నం మృతదేహాన్ని వడ్డాది తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. సన్యాసిరావు దుర్మరణం చెందడంపై భార్య అమ్మాజీ, కుమారులు హరీశ్, వెంకటేశ్, కుమార్తె సూర్యకళ కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆన్‌లైన్ చీటింగ్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూలై 4 : ఆన్‌లైన్ చీటింగ్‌పై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ జి. శంకరరావు గురువారం తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గవరపాలెం బుద్ద ప్రకాశరావునాయుడువీధికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొణతాల రాజేంద్రప్రసాద్‌కు ఈనెల ఒకటో తేదీన గుర్తు తెలియని అగంతకుడు జియో సిమ్ రీచార్జీ ఆగిపోయింది.. మళ్లీ అందుబాటులోకి రావాలంటే రూ.19 రీచార్జి చేసుకోవాలని చెప్పాడన్నారు. దీంతో ఫిర్యాది రాజేంద్రప్రసాద్ రూ.10లు రీచార్జి చేయగా.. ఆ పది రూపాయలతో రీచార్జి కాదని వెనక్కి పంపించి, రూ. 19 రీచార్జి చేయాలని నమ్మించడంతో నిజమే అనుకుని ఫిర్యాది రూ.19లు రీచార్జి చేశాడన్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న అగంతకుడు ఫిర్యాది రాజేంద్రప్రసాద్ అకౌంట్ నుంచి రూ.54,485లు విత్‌డ్రా చేశాడన్నారు. ఈ సంఘటనపై బుధవారం రాత్రి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, జూలై 4 : స్థానిక గవరపాలెం పరమేశ్వరిపార్కు జంక్షన్‌లో బుధవారం రాత్రి ఒక వ్యక్తి నుంచి 18 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. వై.గోపీగణేష్ అనే వ్యక్తి ప్రభుత్వ దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి తన పాన్‌షాపునకు వెళ్తుండగా అనుమానం వచ్చి పరమేశ్వరి పార్కు జంక్షన్ వద్ద తనిఖీ చేయగా 18 మద్యం బాటిళ్లు బయట పడడంతో వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

నాటు తుపాకీతో కుక్కను కాల్చి చంపిన కేసులో ఇద్దరి అరెస్టు

బుచ్చెయ్యపేట, జూలై 4: మండలంలోని కొండపాలెం గ్రామంలో నాటు తుపాకీతో కుక్కను కాల్చి చంపిన కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దాడ శ్రీనివాసరావుకి చెందిన నాటు కోళ్లను వీధి కుక్క చంపేసి తినేస్తోంది. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీనివాసరావు కేపీ అగ్రహారానికి చెందిన యాతగిరి నూకరాజుతో కుక్కను చంపడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో నూకరాజు తన దగ్గర ఉన్న నాటు తుపాకీతో కుక్కను కాల్చి చంపేశాడు. కొండపాలేనికి చెందిన వీఆర్ ఏ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నూకరాజు నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వీరిని చోడవరం కోర్టులో గురువారం హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

మనస్తాపంతో మహిళ మృతి


మృతురాలు డి.ఆశ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, జూలై 4 : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన మహిళ తాను బయట పనికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించడపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు సంబంధించి నక్కపల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన దొంగల ఆశ(27)కి అదే గ్రామానికి చెందిన నాగేంద్రబాబుతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆశ భర్త నాగేంద్రబాబు డ్యూటీకి వెళ్లడంతో అదే గ్రామంలో ఉంటున్న తన పుట్టింటికి వెళ్లింది. తాను ఏదైనా పనికి వెళతానని తల్లిని అడగ్గా ఆమె అంగీకరించలేదు. దీంతో మనస్తాపంతో ఆశ ఈనెల 2వ తేదీన సాయంత్రం చీమల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా.. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందిందని తెలిపారు. దీనిపై ఏఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కశింకోట, జూలై 4 : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ మండలం జోగంపేట గ్రామానికి చెందిన బట్టా నానాజీ (30) అనకాపల్లిలో ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పనులు ముగించుకొని నానాజీ, అదే గ్రామానికి చెందిన శివ వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో బయ్యవరం హెరిటేజ్ పాల ఉత్పత్తుల కేంద్రం వద్దకు వచ్చేసరికి వీరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న నానాజీ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. శివ అపస్మారక స్థితిలో పడిపోయాడు. దీంతో స్థానికులు సమాచారంలో 108 అంబులెన్స్‌లో మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి కారణమైన వాహనం పరారైంది. మృతునికి భార్య ఒక ఏడాది కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కశింకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



మూతపడిన ప్రభుత్వ పాఠశాల

అనకాపల్లి టౌన్, జూలై 4: నీట్, నెట్ పేపర్ లీకేజిని నిరసిస్తూ విద్యార్థి సంఘాల నాయకులు గురువారం పట్టణంలో తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతంగా ముగిసింది. ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు బంద్ పాటించాయి. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ఓ విద్యార్థి సంఘాల నాయకులు పట్టణంలోని అన్ని విద్యాసంస్థలకు వెళ్లి నిరసనలు తెలిపారు. అలాగే నెహ్రూచౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మామిడి రమణ మాట్లాడుతూ నీట్, ఈజీసీ నెట్ పేపరు లీకేజీపై సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఐఐటీ ముంబయి నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు హరీష్, సింహాద్రి, తరుణ్, సందీప్, కుమార్, రాజేష్, సతీష్, విష్ణు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అచ్యుతాపురం రహదారి విస్తరణ షురూ

- యంత్రాల సాయంతో భవనాల కూల్చివేత
- గత ప్రభుత్వంలో పరిహారం తీసుకొని భవనాలు ఖాళీ చేయని యజమానులు
- భవన యజమానులు, వ్యాపారులకు నచ్చజెప్పిన ఎమ్మెల్యే


అచ్యుతాపురం-ఎలమంచిలి రహదారిలో కూల్చివేత పనుల్ని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సరోజిని

అచ్యుతాపురం, జూలై 4: ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చొరవతో అచ్యుతాపురం జంక్షన్‌కి మోక్షం కలిగింది. దీంతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో పరిహారం తీసుకొనికూడా కొందరు వైసీపీ నాయకులు భవనాలనుతొలగించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్డు విస్తరణకు యుద్ధప్రాతిపదికన యంత్రాల సాయంతో అధికారులు భవనాలను కూల్చివేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం జంక్షన్‌ని విస్తరించాలని గతంలో టీడీపీ ప్రభుత్వం యోచించింది. అచ్యుతాపురం-అనకాపల్లి, అచ్యుతాపురం-ఎలమంచిలి రోడ్లను 200 అడుగుల మేర విస్తరించాలని, అలాగే అచ్యుతాపురం జంక్షన్‌ని ఎటుచూసినా 400 అడుగుల మేర విస్తరించాలని భావించింది. ఈ మేరకు అధికారులు సర్వేలు కూడా చేసి మార్కింగ్‌లు కూడా ఇచ్చారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో పనులకు బ్రేక్ పడింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా రోడ్డు విస్తరణ పనులను కొనసాగించింది. అయితే కేవలం వంద అడుగుల మేర మాత్రమే విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు అచ్యుతాపురం జంక్షన్ పరిధిలోని భూ నిర్వాసితులకు అధికారులు పరిహారం కూడా పంపిణీ చేశారు. అయితే పరిహారం తీసుకున్న కొంతమంది తమ ఇళ్లను తామే యంత్రాలతో తొలగించి, పునర్నిర్మాణాలు చేసుకున్నారు. అయితే జంక్షన్‌లో పలుకుబడి కలిగిన నాయకులు మాత్రం పరిహారం తీసుకున్నా.. భవనాలను తొలగించలేదు. దీంతో వైసీపీ నాయకులు కూడా వారిపై ఒత్తిడి తీసుకురాలేదు. ఫలితంగా ప్రతి రోజూ అచ్యుతాపురం జంక్షన్‌లో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యేది. అయినా ఇటు అధికారులు గాని, అటు ప్రజాప్రతినిధులు గాని పట్టించుకొనేవారు కాదు. కూటమి ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే సుందరపు విజయకుమార్ అచ్యుతాపురం జంక్షన్‌పై దృష్టి సారించారు. తొలుత భవన యజమానులు, ఫుట్‌పాత్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. అయినా కొందరు నాయకులు పట్టించుకోలేదు. దీంతో విజయకుమార్ ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమీక్షించి పరిహారం తీసుకున్న వారి భవనాలను యంత్రాల సాయంతో కూల్చివేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు భారీ యంత్రాల సాయంతో జంక్షన్‌లోని బహుళ అంతస్థుల భవనాలను కూల్చివేయడం ప్రారంభించారు. భవనాలు కూల్చివేత పనులను తహసీల్దార్ సరోజిని పర్యవేక్షిస్తుండగా, సీఐ బుచ్చిరాజు భవనాలలు వద్ద బారీకేడ్లు ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ అచ్యుతాపురం జంక్షన్‌ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమన్నారు. సెజ్‌లో గల కర్మాగారాలకు వచ్చే విదేశీ ప్రతినిధులు, అతిథులు సెజ్ ముఖద్వారమైన అచ్యుతాపురం జంక్షన్‌ని చూసి మెచ్చుకొనేలా తీర్చిదిద్దుతానన్నారు. వివిధ కారణాల వల్ల ఇంతవరకు పరిహారం తీసుకోని నిర్వాసితుల పరిహారపు నగదును కోర్టులో జమ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు పెట్టడానికి ప్రయత్నించినా అచ్యుతాపురం జంక్షన్ విస్తరణ పనులు ఆపేది లేదని సుందరపు స్పష్టం చేశారు.

జల వనరుల బకాయిలు రూ.389.12 కోట్లు

- ఉత్తరాంధ్ర చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు ప్రభుత్వానికి నివేదిక


ఇరిగేషన్ సీఈ ఎస్.సుగుణాకరరావు

విశాఖపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల్లో గడచిన రెండు, మూడేళ్లలో జల వనరుల శాఖ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి రూ. 389.12 కోట్ల బకాయిలు ఉన్నట్టు నార్త్ కోస్టల్ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.121.12 కోట్ల బిల్లులు సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేశామన్నారు. మరో రూ.29.09 కోట్ల బిల్లులు సిద్ధం చేశామన్నారు. ఇంకా రూ.238.89 కోట్ల విలువైన పనులు పూర్తికాగా వాటి వివరాలు ఎంబుక్‌లో నమోదుచేయాల్సి ఉందన్నారు. ఉత్తరాంధ్రలో భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు 18 ఉన్నాయని, వీటిలో వంశధార ప్రాజెక్టు నిర్వహణ, అత్యవసర పనులు చేపట్టిందుకు రూ.25 కోట్లు, తారకరామా ప్రాజెక్టుకు రూ.20 కోట్లు, మూడు జిల్లాల్లో జపాన్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి రూ.35 కోట్లు బిల్లులు విడుదల చేయాల్సి ఉందన్నారు. ఇంకా మహేంద్రతనయా ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం రూ.35 కోట్లతో పనులు పూర్తిచేయగా, వాటిలో రూ.20.34 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. నదుల వరద కట్టల మరమ్మతుల కోసం రూ.51 కోట్లు వెచ్చించగా రూ.17 కోట్లు, తాటిపూడి ప్రాజెక్టు కింద రూ.17.6 కోట్ల పనులకు బిల్లులు అప్‌లోడ్ చేశామని వివరించారు. ఇటీవల జల వనరుల శాఖా మంత్రి సమీక్షలో బకాయిల వివరాలు ఇవ్వాలని ఆదేశించడంతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు చెల్లించాల్సిన బిల్లులపై నివేదిక రూపొందించి అందజేశామన్నారు.

ఇదిలావుండగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఉత్తరాంధ్రలో 6.18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రతిపాదించామన్నారు. తోటపల్లి ప్రాజెక్టు కింద పాత ఆయకట్టు 64 వేల ఎకరాలతోపాటు కొత్తగా తవ్విన కాలువల ద్వారా 84 వేల ఎకరాలకు నీరు విడుదల చేశామన్నారు. ఇంకా వంశధార, తాటిపూడి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీరు విడుదల చేశామన్నారు. కాగా, ప్రాజెక్టుల కింద కాలువల నిర్వహణ కోసం ఈ ఏడాది రూ.20 కోట్లు అవసరమని ప్రతిపాదించామన్నారు. ఇంకా నదులు, కాలువల గట్టు పటిష్ఠం చేయడం, గండ్లు పూడ్చడం, నిర్వహణకు నిధులు అవసరమని కోరినట్టు సీఈ సుగుణాకరరావు తెలిపారు. కాలువల పర్యవేక్షణకు 728 మంది లస్కర్లను తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తామన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

- గ్రామసభలో వెల్లడించిన సోషల్ ఆడిట్ అధికారులు

పాయకరావుపేట రూరల్, జూలై 4: మండలంలోని నామవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీల్లో భాగంగా గురువారం నిర్వహించిన గ్రామసభలో పలు అవకతవకలు వెలుగుచూశాయి. వీఆర్‌పీ దాసరి రామస్వామి ఉపాధి పనుల్లో బినామీ మస్తర్లతో భారీ అవకతవకలకు పాల్పడినట్టు సోషల్ ఆడిట్ అధికారులు వెల్లడించారు. ఉపాధి పనుల్లో వీఆర్‌పీ భారీగా అక్రమాలకు పాల్పడినట్టు గ్రామస్థులు గ్రామసభలో ఆరోపించారు. పనులకు రాని వారికి కూడా మస్తర్లు వేశారని, పనులు చేసిన వారికి కొంతమందికి పేమెంట్లు చెల్లించలేదని ఉపాధి కూలీలు ఆరోపించారు. గ్రామంలో సుమారు 87 పనులకు సంబంధించి చేపట్టిన రూ.54 లక్షల ఉపాధి పనుల్లో సుమారు రూ.21.7 లక్షలు అవకతవకలు జరిగినట్టు గుర్తించినట్టు సోషల్ ఆడిట్ అధికారులు తెలిపారు. వీటిలో హౌసింగ్ లబ్ధిదారులకు కాకుండా బయట వాళ్లకు రూ.3 లక్షల 47 వేల 296లు, బినామీ మస్తర్ల ద్వారా రూ.లక్షా 2 వేల 634లు, ఉపాధి పనుల కొలతల్లో సుమారు రూ.17 లక్షల 10 వేల 809లు అవతవకలు జరిగాయని వెల్లడించారు. అదే విధంగా పునాది లెవెల్లో ఉన్న ఇళ్లకు రూఫ్ లెవెల్లో బిల్లు చేసినట్టు, ఒకే ఇంట్లో రెండు జాబ్‌కార్డులతో పనులు చేపట్టినట్టు గుర్తించామన్నారు. ఉపాధి పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ అధికారులు చదివి వినిపిస్తుండగా గ్రామస్థులు అవకతవకలపై నిలదీయగా, ఎన్ఆర్‌జీఎస్ అధికారులు పిలుస్తున్నా వినిపించుకోకుండా వీఆర్‌పీ రామస్వామి గ్రామసభ నుంచి వెళ్లిపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఏపీవో హేమలత, టీఏ అచ్యుత్, డీఆర్‌పీ బి.పోలిరాజు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునాచార్యులు, టీడీపీ నాయకులు కురందాసు శివ, గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్ల లక్ష్మీనారాయణ, గొర్ల బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీ, ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసంపై ఆందోళన

- ఘటనకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని టీడీపీ శ్రేణుల డిమాండ్


జానకిరాంపురంలో గురువారం రాత్రి ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు, (ఇన్‌సెట్‌లో) పాక్షికంగా ధ్వంసమైన ఎన్టీఆర్ విగ్రహం

రోలుగుంట, జూలై 4: మండలంలోని జానకిరాంపురం గ్రామంలో టీడీపీ ఫ్లెక్సీ చించివేత, ఎన్టీఆర్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన ఘటనలో బాధ్యులను అరెస్టు చేయాలని టీడీపీ శ్రేణులు గురువారం రాత్రి ఆందోళన చేశారు. గ్రామంలో పింఛన్ల పంపిణీ సందర్భంగా టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, ఎంపీ సీఎం రమేశ్ ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని బుధవారం రాత్రి వైసీపీ మద్దతుదారులైన కొంత మంది వ్యక్తులు చించివేయడంతో పాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అయితే ఘటనకు కారకులైన వారిని ఇంకా అరెస్టు చేయకపోవడంతో గురువారం రాత్రి 11 గంటలకు టీడీపీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహం పక్కన టెంట్ వేసి ఆందోళన చేపట్టారు.

మోటూరుపాలెంలో పలువురికి అస్వస్థత

అచ్యుతాపురం, జూలై 4: మండలంలోని దిబ్బపాలెం సచివాలయం-1 పరిధిలో గల మోటూరుపాలెంలో నిల్వ ఆహారం తిని తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యబృందం సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. మోటూరుపాలెంకి చెందిన ఒక కుటుంబం నిల్వ ఆహారం తినడంతో నలుగురు వాంతులు, విరేచనాలతో మంగళవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వీరు అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన వైద్య సిబ్బంది విషయాన్ని ఎంపీడీఓ సురేష్ కుమార్‌కు తెలిపారు. వీరంతా గ్రామాన్ని సందర్శించి, వ్యాధి సోకడానికి కారణాలను తెలుసుకున్నారు. అలాగే పక్కనున్న ఇంటిలో మరో ఐదుగురికి వాంతులు, విరేచనాలు కావడంతో వారిని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరిని గురువారం డిశ్చార్జి చేశారు. మరో ముగ్గురు అనకాపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, డీఐఓ డాక్టర్ చంద్రశేఖర్, ఎపిడమిక్ డాక్టర్ సతీష్, డాక్టర్ విజయకుమార్ మోటూరుపాలెం వెళ్లి పరిశీలన జరిపారు. అక్కడ ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ని ఏర్పాటుచేశారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

- పరవాడ డీఎస్పీ సత్యనారాయణ


కొత్త చట్టాలపై బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ గఫూర్

ఎలమంచిలి, జూలై 4 : ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదైన 24 గంటల్లో సీఐతో పాటు ఎస్ఐలు సకాలంలో స్పందించి హత్య కేసును త్వరితగతిన ఛేదించారని ఆయన తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. కాగా జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. ఎలమంచిలి పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల వద్ద గంజాయి వినియోగించకుండా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ గఫూర్, పట్టణ ఎస్ఐ పాపినాయుడు పాల్గొన్నారు.

పెట్రోలియం, ఎనర్జీ సంస్థలో నిర్మాణాలు పూర్తి చేయాలి

- కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రిని కోరిన ఎంపీ సీఎం రమేశ్


కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్‌పూరికి వినతి పత్రం అందిస్తున్న ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సబ్బవరంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, ఎనర్జీ సంస్థలోని రెండో దశ భవన నిర్మాణ పనులను ప్రారంభించి, పూర్తి చేయాలని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పూరికి ఎంపీ సీఎం రమేశ్ కోరారు.

ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో మంత్రిని కలిసిన ఎంపీ రమేశ్ సబ్బవరంలో పెట్రోలియం, ఎనర్జీ సంస్థలో రెండో దశ భవన నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరంపై సమగ్ర నివేదికను అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

- డీఈవో వెంకటలక్ష్మమ్మ


ఏఎల్‌పురం హైస్కూల్‌లో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కృష్ణాదేవిపేట, జూలై 4: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు నిరంతరం కష్టపడాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. గురువారం గొలుగొండ మండలం ఏఎల్‌పురం హైస్కూల్‌ను ఆమె సందర్శించి ఉపాధ్యాయుల హాజరుపట్టిక, రికార్డులు తనిఖీలు చేశారు. అనంతరం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన మెనూ పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో అందాయా?, లేదా? అని ఆరా తీశారు. నోట్ పుస్తకాలను పరిశీలించి విద్యార్థులను ప్రశ్నలు వేసి సరైన సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరు లతో డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. ఆమె వెంట ఎంఈవో సత్యనారాయణ, స్థానిక ఇన్‌చార్జి హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు రామరాజు, టీవీ రమణ, లక్ష్మి, రామ్‌కుమార్, అచ్చుబాబు తదితరులు ఉన్నారు.

అల్లూరి చిత్రకళా మందిరం ప్రారంభం


స్పీకర్ అయ్యన్నకు అల్లూరి చిత్రపటాన్ని అందజేస్తున్న జాతీయ అల్లూరి యువజన సంఘం ప్రతినిధులు

కృష్ణాదేవిపేట, జూలై 4: అల్లూరి చరిత్రకు సంబంధించి అద్భుతమైన కళాఖండాలు విద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడతాయని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం అల్లూరి 127వ జయంతిని పురస్కరించుకుని కృష్ణాదేవిపేట సమాధులున్న పార్కులో జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఏర్పాటు చేసిన కళా మందిరాన్ని అయ్యన్న ప్రారంభించారు. ఈ కళా మందిరంలో రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవిప్రకాశ్, ఇతర కళాకారులు రూపొందించిన 18/24 వెడల్పు గల అల్లూరి చరిత్రకు సంబంధించిన 32 చిత్రపటాలు ఏర్పాటు చేశారు. ఇవి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

అల్లూరి చరిత్ర ఉద్యమాలకు స్ఫూర్తి

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ


కృష్ణాదేవిపేట గ్రంథాలయం వద్ద నిలువెత్తు అల్లూరి ఫైబర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

కృష్ణాదేవిపేట, జూలై 4: ఉద్యమాలకు స్ఫూర్తి విప్లవ వీరుడు అల్లూరి జీవిత చరిత్ర అని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి మైత్రి గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన నిలువెత్తు ఫైబర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి నడయాడిన ఈ ప్రాంతంలో అందరూ అల్లూరి అడుగుజాడలో నడవాలన్నారు. ఉద్యోగులు, పోలీసులు భాగస్వాములై తొమ్మిదేళ్ల క్రితం గ్రంథాలయం ఏర్పాటు చేసి అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కృష్ణాదేవిపేట హైస్కూల్‌లో టెన్త్, ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు కలిపి రూ.20 వేల నగదును విద్యార్థులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మణికుమారి, సర్పంచ్ సుజాత, నర్సీపట్నం డీఎస్పీ మోహన్, శ్రీకాకుళం సిటీ సీఐ సోమశేఖర్, ఏలూరు సీఐ అల్లు స్వామి నాయుడు, విశాఖ సిటీ సీఐ పి.ఉదయ్‌కుమార్, నర్సీపట్నంరూరల్, కొయ్యూరు సీఐలు బి.హరి, ఎస్‌వీ రమణ, కృష్ణాదేవిపేట, నర్సీపట్నంరూరల్ ఎస్ఐలు ఉపేంద్ర, భీమరాజు, అల్లూరి మైత్రి గ్రంథాలయ సభ్యులు శర్మ, డేవిడ్‌రాజు, పోతల శ్రీరామ్మూర్తి , అప్పలకొండ, సత్యనారాయణ, వాసు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జూపార్కుకు కొత్త అతిథుల రాక


కామన్ మార్మో సెట్ (తెల్ల పక్షులు)

విశాఖపట్నం, జూలై 4: నగరంలోని జూపార్కుకు గురువారం సాయంత్రం కొత్త జంతువులు వచ్చినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొత్త జంతువు లను గుజరాత్‌లోని మోటీ ఖణీ జమ్నాగర్‌లోని రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు నుంచి తీసుకువచ్చామని చెప్పారు. వీటిని జంతు మార్పిడి పద్ధతిలో తీసుకువచ్చామన్నారు. వైద్యులు వాటిని పరీక్షించి, జూలోని క్వారంటైన్‌లో ఉంచారు. వీటిలో ఆకుపచ్చ రెక్కల మకావ్, స్కార్లెట్ మకావ్, మిలిటరీ మకావ్, మీడియం సల్ఫర్ కకాటూ, స్లెండర్ టెయిల్డ్ మీర్కట్, రెడ్ నెక్డ్ వల్లబీ, స్విర్రల్ మంకీ ఉన్నాయి. మొత్తం 29 కొత్త జంతువులను తీసుకువచ్చినట్టు తెలిపారు. వీటికి బదులు ఇక్కడి నుంచి హైనా, హాగ్ డీర్, పెయింటెడ్ స్టార్క్, గ్రె పెలికాన్, స్టార్ టార్టాయిస్, ఘరీయల్, జంగిల్ క్యాట్, ధోలే, తోడేలు, గౌర్ వంటి 49 రకాల పక్షులు, ఇతర జంతువులను అందించారు.

భూ సర్వేలో పొరపాట్లపై గగ్గోలు

- ఎలమంచిలి మండల సమావేశంలో ఏకరువు పెట్టిన సర్పంచ్‌లు
- 60 సెంట్లకు.. రెండు సెంట్లు నమోదైందన్న కో-ఆప్షన్ సభ్యుడు
- సదరు సర్వేయర్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్యే.. షోకాజ్ ఇవ్వాలని ఆదేశం



సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, జూలై 4 : సమగ్ర భూ సర్వేలో దొర్లిన పొరపాట్ల కారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలు పలుచోట్ల ఎదుర్కొంటున్న సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు ఏకరువు పెట్టారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన గురువారం ఎలమంచిలి మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా సభకు విచ్చేసిన సుందరపు విజయకుమార్‌ను ఎంపీపీ సహా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పూలమాలలతో ముంచెత్తారు. అనంతరం సభ ప్రారంభం కాగా, 60 సెంట్ల భూమికి.. రెండు సెంట్లు మాత్రమే నమోదైనట్టు ఉందని, ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని వైసీపీ కో-ఆప్షన్ సభ్యుడు నూకేశ్వరరావు వాపోయారు. అనంతరం పోతిరెడ్డిపాలెం సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కృష్ణాపురం సర్పంచ్ గాంధీ మాట్లాడుతూ సమగ్ర సర్వేలో దొర్లిన పొరపాట్ల కారణంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఇందుకు కారణమైన సర్వేయర్ రామారావును ప్రశ్నించారు. మరీ 60 సెంట్లు ఉంటే రెండు సెంట్లు మాత్రమే నమోదు కావడం ఏమిటని నిలదీశారు. వెంటనే ఈ సర్వేయర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని తహసీల్దార్ అప్పలరాజును ఆదేశించారు. అనంతరం మరికొంతమంది సభ్యులు ఆయా గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. లైనుకొత్తూరు, రేగుపాలెం గ్రామ పరిసరాల్లో రాత్రి సమయాల్లో తరలిపోతున్న గ్రావెల్ గురించి ఎమ్మెల్యే స్థానిక కార్యదర్శులను ప్రశ్నించగా, తమకేమీ తెలియదని వారు బదులిచ్చారు. దీనిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గంజాయి ఆనవాళ్లు లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సెబ్ అధికారులను ఆదేశించారు. గంజాయికి అలవాటు పడినవారు చేస్తున్న చేష్టలు దారుణంగా ఉంటున్నాయన్నారు. ఇటువంటి వారిలో చైతన్యం తీసుకు రావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. గృహ నిర్మాణాలపై సదరు శాఖ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇళ్లు నిర్మించుకోలే వారు అధికంగా ఉండడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమష్టిగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రజా ప్రతినిధుల్లో మార్పు రావాలని, అందరి ప్రోత్సాహంతో నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దదామని అన్నారు. ప్రతి అంశంపై సర్పంచ్‌లు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కొండబాబు, తహసీల్దార్ అప్పలరాజు, జెడ్పీటీసీ శానాపతి సంధ్యారాణి, వైస్ ఎంపీపీలు రాజాన శేషు, ఉమాలతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్‌కే డిమాండ్

... 5వ పేజీ తరువాయి

కలిగినవారు లక్షల రూపాయలు పోసి సీట్లు కొంటున్నారు. నగర శివారుల్లోని రెండు కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాలో కంప్యూటర్ సైన్స్ సీటు కావాలంటే తొలుత ఆరు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయలు కట్టాలి. ఆ తరువాత ఏటా రూ.2.25 లక్షల చొప్పున నాలుగేళ్లలో మరో రూ.తొమ్మిది లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే మొత్తం రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షలు అవుతుంది. దానికి పుస్తకాలు, రవాణా, ఇతరత్రా ఖర్చులు అదనం. మరో రెండు కళాశాలల్లో డొనేషన్లు, నాలుగేళ్ల ఫీజు కలిపి రూ.10 లక్షల నుంచి రూ.11 లక్షలు అవుతుందని గాజువాకకు చెందిన దాసరి సురేంద్ర అనే పేరెంట్ వెల్లడించారు. పొరుగు జిల్లాలో ప్రముఖ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీటుకు రెండు లక్షలు డొనేషన్ చెల్లించామని తగరపువలసకు చెందిన వెంకట్ అనే పేరెంట్ వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే తీసుకుని సీట్లు కేటాయించాలన్న నిబంధనను ఏ ఒక్క కళాశాల యాజమాన్యం పాటించడం లేదని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ కాకుండా మిగిలిన బ్రాంచీలకు పెద్దగా డిమాండ్ ఉండడం లేదు. ఏయూలో మాత్రం కంప్యూటర్ సైన్స్ తరువాత మిగిలిన బ్రాంచీల్లో చేరేందుకు విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు ఇస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ కాకుండా ఇతర బ్రాంచీల విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఐటీ రంగంలో ఉద్యోగం పొందాలంటే కంప్యూటర్ సంబంధిత కోర్సులు చేయాల్సిందేనని ఐటీ కన్సల్టెంట్ నిపుణుడు నరసింహరావు వ్యాఖ్యానించారు. ఐటీ రంగంలోనే భారీ ఉద్యోగాలు ఉన్నందున ఎక్కువ మంది ఆ కోర్సుల్లో చేరుతున్నారని, ఈ ట్రెండ్ రెండున్నర దశాబ్దాల నుంచి కొనసాగుతుందన్నారు. రెండు, మూడేళ్ల నుంచి కంప్యూటర్ సైన్స్‌తో పాటు అందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటాసైన్స్ కోర్సులు వచ్చాయన్నారు.

ఎక్కువ ఉద్యోగాలతోనే కంప్యూటర్ సైన్స్‌పై ఆసక్తి

ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. పేరున్న కళాశాలల్లో సీటు కోసం లక్షలు వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం ఐటీలో కొంత స్లంప్ ఉన్నా..ఇప్పటికీ ఈ రంగంలోనే ఎక్కువ ఉద్యోగాలు దొరుతుతున్నాయి.

- ఆచార్య వెంకటరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, ఏయూ

పేదింటి కల నెరవేర్చలేక పాయె!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణ పనులకు సిద్ధమయ్యారు. లబ్ధిదారుడు ఎంచుకున్న ఆప్షన్ ప్రకారం ఇసుక, సిమెంట్, , ఇనుము ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంటుంది. నిర్మాణ పనులు చేపట్టిన లబ్ధిదారులకు వైసీపీ ప్రభుత్వం వీటిని అరకొరగా అందించడంతో అవి సరిపోక పలు చోట్ల నిర్మాణ పనులు ఆగిపోయాయి. కొందరు లబ్ధిదారులు అప్పులు చేసి ఇంటి పనులు చేపట్టినా బిల్లులు మాత్రం అందలేదు.

సగం ఇళ్లు కూడా పూర్తి కాని వైనం

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం పేదలకు గత నాలుగేళ్లలో 56,580 గృహాలు మంజూరు చేసింది. వీటిలో సగం ఇళ్ల నిర్మాణ పనులు కూడా పూర్తికాలేదు. ఇళ్ల నిర్మాణ పనుల కోసం రూ.1,018 కోట్లు మంజూరు చేసినా కేవలం రూ.537 కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో జిల్లాలో జగనన్న కాలనీల్లో కేవలం 22 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేయగలిగారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాల్లో బేస్‌మెంట్ లెవిల్ లోపు 14,730, బేస్‌మెంట్ లెవిల్‌లో 11,039, రూఫ్ లెవిల్‌లో 2,823, రూఫ్ కాస్ట్ దశలో 3,452 నిర్మాణాలు జరిగాయి. సార్వత్రిక ఎన్నికల ముందు వరకు గత ఏప్రిల్ నెల వరకు అక్కడక్కడా ఇళ్ల నిర్మాణ పనులు జరిగినా తరువాత ఎన్నికలు జరగడంతో గత మూడు నెలలుగా పేదల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లాలో ఆగిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వంపైనే లబ్ధిదారుల ఆశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తాము ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయామని, కొత్త ప్రభుత్వం పెండింగ్ బిల్లులను చెల్లించి తమను ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

విప్లవ వీరునికి వందనం

- వాడవాడలా ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి
- పోరాట పటిమను కీర్తించిన వక్తలు



జిల్లా ఎస్పీ కార్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద ఏఎస్పీ నివాళి



అనకాపల్లిలోని అల్లూరి జయంతిలో మాట్లాడుతున్న బుద్ధ

అనకాపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఏఎస్పీ (పరిపాలన) బి.విజయ్ భాస్కర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి పోరాట పటిమను కీర్తించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, గణేష్, కుమారస్వామి, పలువురు ఎస్ఐలు, కార్యాలయంలో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, ఇక్కడి సీపీఎం కార్యాలయంలో అల్లూరి జయంతిని జరిపారు. జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, నాయకులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, నాయన బాబు, డీడీ వరలక్ష్మి, సూర్యప్రభ తదితరులు నివాళులర్పించారు.

తుమ్మపాల : అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, కొణతాల వెంకటరావు, కాంద్రేగుల సత్యనారాయణ, బోడి వెంకటరావు, పిళ్లా తారకేసు తదితరులు పాల్గొన్నారు. అలాగే, తుమ్మపాలలో అల్లూరి విగ్రహానికి ఉమ్మడి పార్టీ నాయకులు పూసపాటి భరత్‌బాబు, కర్రి బాబి, చదరం నాగేశ్వరరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

అనకాపల్లి టౌన్ : ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో అల్లూరి జయంతి నిర్వహించారు. యూనియన్ మండల కన్వీనర్ పీఎస్‌వీ పరమేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, ఏవీ నూకఅప్పారావు, వారాధి సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు నివాళులర్పించారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోట సంతబయలు వద్ద ఉన్న అల్లూరి జయంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కూటమి నేతలు నడిపల్లి సన్యాసిరావు, వై.ఎ.రాజు, సిష్టి అప్పారావు, వేగి పాపారావు, పడాల పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : అల్లూరి జయంతిని పాయకరావుపేటలో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ కె.స్వప్న, ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, ఏఓ వర్మ తదితరులు పూలమా లలువేసి నివాళులర్పించారు. రాజుగారిబీడులో అల్లూరి చిత్రపటానికి శ్రీహరిరాజు, రాజబాబురాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్ : గోపాలపట్నం సమీపంలోని సీతమ్మవారి కొండపై అల్లూరి జయంతిని నిర్వహించారు. పీసీపీ ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాసరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ విగ్రహాన్ని గ్రామానికి చెందిన పిన్నమరాజు ఫకీర్‌రాజు ఏర్పాటు చేశారు. సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పోలవరపు అప్పలరాజు, శివాజీరాజు, మహదేవ్‌బాబా, రామకృష్ణ, నాని పాల్గొన్నారు.

నక్కపల్లి : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం అల్లూరి జయంతిని జరిపారు. ఎంపీపీ వైరత్నం, జడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంఈవో నరేశ్, పలు పార్టీల నాయకులు వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేశ్, కోసూరి శ్రీనివాసరావు, మణిరాజు, కనకారావు, అయినంపూడి అప్పలరాజు తదితరులు అంజలి ఘటించారు.

ఎస్.రాయవరం : మండలంలోని పలు గ్రామాల్లో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తాహసీల్దార్ వై.జయలక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుడివాడ గ్రామంలో క్షత్రియ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకను జరిపారు. సీతారామరాజు విగ్రహానికి టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు పలువురు క్షత్రియలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజా వెంకటనగరం గ్రామంలో ఉన్న అల్లూరి విగ్రహానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.

కోటవురట్ల : అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని అంతా ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథం పిలుపునిచ్చారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోరాట పటిమను కీర్తించారు.

ఎలమంచిలి : అల్లూరి సీతారామరాజు జయంతిని ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ అప్పలరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రాంబిల్లిలో క్షత్రియ సంఘు ఆధ్వర్యంలో...



అచ్యుతాపురం బీజేపీ కార్యాలయంలో...

అచ్యుతాపురం/అచ్యుతాపురం రూరల్ : మండలంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ కార్యాలయంలో పార్టీ ఎలమంచిలి ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక గ్రంథాయంలో, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో, మల్లవరంలలో ఈ వేడుక జరిపారు. ఈ కార్యక్రమాల్లో కూండ్రపు నాయుడుబాబు, బి.కోటేశ్వరరావు, కర్రి అప్పారావు, రొంగలి రాము, పి.వాసు, రవీంద్ర పాల్గొన్నారు. అలాగే, మల్లవరంలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాంబిల్లి : క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో ఇక్కడ అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ మండల నాయకులు జి.శ్రీనుబాబు, పి.కిశోర్, బీజేపీ నాయకులు బీవీఎస్ వర్మ, జేవీఎస్ఎన్‌రాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కలిదిండి రఘురాజు, క్షత్రియ నాయకులు హుజూర్‌రాజు, బి.వర్మరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది అల్లూరికి అంజలి ఘటించారు.

పరవాడ : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని వాడచీపురుపల్లిలో ఉపాధి కూలీలు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణతో పాటు ఉపాధి కూలీలు పార్వతి, కాసులమ్మ, వరలక్ష్మి, రత్నం, ధనలక్ష్మి, నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లూరి విగ్రహానికి టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధానకార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ ఆడారి మంజు, నాయకులు నాగేశ్వరరావు, ఎంపీటీసీ దొరమ్మనాయుడు, మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



ఎస్.రాయవరం మండలం కొరుప్రోలులో పాఠశాల విద్యార్థులను బయటకు పంపిస్తున్న సంఘం నాయకులు



ఎలమంచిలిలో విద్యార్థులు, సంఘాల నాయకుల నినాదాలు

ఎలమంచిలి, జూలై 4 : నీట్, నెట్ నిర్వహణలో లోపాలను నిరసిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ వంటి విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. ఇందులో భాగంగా పిలుపునిచ్చిన బంద్ ప్రశాంతంగా సాగింది. ఎలమంచిలిలో పలు పాఠశాలలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా పట్టణంలోని రోడ్డుపై విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. నీట్‌లో లీకులకు కారణమైన సంస్థను రద్దు చేయాలని, పరీక్ష రాసి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.బాలాజీ, జిల్లా కమిటీ సభ్యుడు జగదీష్ ప్రసాద్, కార్తీక్, దుర్గారావు, ప్రసాద్, రాఘవేంద్ర, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : నీట్ రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం నష్టపరిహారం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రకాష్, ఎన్.రమేష్, దివాకర్, మణికంఠ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నీట్ నిర్వహణలో లోపాలపై ఇక్కడ బంద్ నిర్వహించారు. పలువురు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : నీట్‌లో అక్రమాలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ ఇక్కడ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ బంద్‌కు మద్దతుగా పట్టణంలోని అన్ని విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించి మూసివేశాయి. ఇటీవల నిర్వహించిన నీట్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సభ్యులు రాజేష్, సింహాద్రి, రమణ తదిత రులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలల బంద్ విజవంతమైంది. నీట్‌లో నిర్వహణను నిరసిస్తూ ఈ ఆందోళనను చేపట్టారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు జి.అప్పలరాజు, వై.సురేష్, బి.శివ, రామకృష్ణ, యోగేష్, జగన్ తదితరులు బంద్ విజయవంతానికి కృషి చేశారు.

అచ్యుతాపురం : నీట్ నిర్వహణను నిరసిస్తూ అచ్యుతాపురంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు కూండ్రపు సోమునాయుడు, ఎం.బాలాజీలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాంబిల్లి : నీట్, నెట్ నిర్వహణ లోపాన్ని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఇక్కడ ఆందోళన చేపట్టాయి. ఎస్ఎఫ్ఐ మండల ప్రతినిధి బద్ది నందు, డీవైఎఫ్ఐ ప్రతినిధి ఎస్.నారాయణరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ నీట్, నెట్ పేపర్ లీకేజీల వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. వారికి న్యాయం చేయాల్సిందిగా కోరారు.

ఘనంగా 'వంగవీటి' జయంతి



పాయకరావుపేటలో వంగవీటి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాపు నాయకులు



నక్కపల్లిలో...



గుంటపల్లిలో నివాళులర్పిస్తున్న గెడ్డం బుజ్జి

పాయకరావుపేట, జూలై 4 : కాపు ఉద్యమ నేత వంగవీటి మోహనరంగ జయంతిని గురువారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగతా శ్రీనివాస్ గొర్రెల వీర్రాజునగర్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, యాళ్ళ వరహాలబాబు, దగ్గుపల్లి సాయిబాబా, యాళ్ళ సన్నబాబు, నారపురెడ్డి పద్మ, వెలుగుల అర్జునరావు, డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్, జూలై 4 : మండలంలోని గుంటపల్లి, అరట్లకోట, పాల్తేరు గ్రామాల్లో గురువారం వంగవీటి మోహనరంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. గుంటపల్లిలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో గెడ్డం ఆకాష్ పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని అనేక గ్రామాల్లో వంగవీటి మోహనరంగా జయంతిని నిర్వహించారు. నక్కపల్లిలో కాపు సంఘం నేతలు వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేశ్, కోసూరి శ్రీను, మీగడ సత్తిబాబు, కేవీ సత్యనారాయణ, త్రినాథ్, ముద్దా శ్రీను ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపమాకలో ఆయన విగ్రహానికి కాపు సంఘ నేతలు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, ప్రగడ వీరబాబు, సిద్దాబత్తుల నూకతాత, సత్తిబాబు, కొప్పిశెట్టి జగదీశ్వరరావు, దిలీప్, హరి, తోట అప్పారావు, వాసు, తోలేటి శ్రీను, రవి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్.రాయవరం : మండలంలోని పలు గ్రామాల్లో వంగవీటి మోహనరంగా జయంతిని నిర్వహించారు. గెడ్డపాలెంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు తన్నీటి ఎరకయ్య, ఉపసర్పంచ్ దుబాసి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నేత అక్కపు జోగారావు, జనసేన నాయకులు దుబాసి రవిశంకర్, అక్కపు గణేష్, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

వెంకటాపురంలో మరిడిమాంబ జాతర



రాంబిల్లి, జూలై 4 : వెంకటాపురంలో కొలువుదీరిన మరిడిమాంబ జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి పసుపుకుంకుమలను సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ నాయకులు ధూళి రంగనాయకులు, వి.దిన్‌బాబు, మాజీ సర్పంచ్ వెంకటరావు, సర్పంచ్ కిల్లాడ తాతబ్బాయి, గ్రామ పెద్దలు దర్శించుకున్నారు.

పాటిమీద గ్రామంలో నూకాలమ్మ వేడుక

నక్కపల్లి, జూలై 4 : అమలాపురం పంచాయతీ పాటిమీద గ్రామంలో గురువారం కాండ్రకోట నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది. మండలానికి చెందిన పలువు నాయకులు దర్శించుకున్నారు.

పాల సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

సబ్బవరం, జూలై 4 : రాయపు అగ్రహారం పాల సొసైటీ అధ్యక్షుడిగా కోన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయనను అంతా కలిసి ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడ్ని మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, మాజీ సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట, జూలై 4 : మండలంలోని సత్యవరం సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం మూడు గంటలు విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి పదకొండు గంటల వరకు శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, కేశవరం, రాజవరం, గజపతినగరం, రాజానగరం, వెంకటనగరం, కుమారపురం, రత్నయ్యమ్మపేట, రాజగోపాలపురం, పాల్తేరు, పెద రాంభద్రపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నదని వివరించారు.

లంకెలపాలెం: పెదముషిడివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లంకెలపాలెం, శ్రీరామ్‌నగర్, వినాయకనగర్, గెంజిపేట, గొల్లపేట, ఎస్సీ కాలనీ, గంగిరెడ్ల కాలనీ, శ్రీరాంనగర్, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, ఇ-మర్రిపాలెం, గొన్నవానిపాలెం, పెదముముషిడివాడ, వియజరాంపురం, నక్కవానిపాలెం, గండివానిపాలెం, పచ్చికోరువానిపాలెం, కన్నూరు, మంత్రిపాలెం గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

'రైతులను సాగుకు ప్రోత్సహించాలి'



విత్తనాలను పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, జూలై 4 : ఖరీఫ్ సాగుపై రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించి వ్యవసాయం పట్ల మరింత మక్కువ చూపేలా ఆ శాఖ అధికారులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. మండలంలోని మొగలిపురంలో రైతులకు గురువారం రాయితీపై విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. అదేవిధంగా మల్లునాయుడు పాలెం, ఆరిపాక గ్రామాల్లో విత్తనాల పంపిణీ జరిగింది. వైస్ ఎంపీపీ రూన్సీలక్ష్మీరాణి, కూటమి నాయకులు గండి దేముడు, బంగారునాయుడు, నానాజీ, ఆడారి నాగరాజు, చినరాజు, పైడింనాయుడు,పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : గవరపాలెంలో రైతులకు గురువారం కూటమి నాయకులు వరి విత్తనాలను పంపిణీ చేశారు. గవరపాలెంలోని రైతులకు 80వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు చేతుల మీదుగా విత్తనాలను అందజేశారు. నాయకులు సూరిశెట్టి రాముడు, బొడ్డేడ మురళీ, మళ్ల సురేంద్ర, హరికృష్ణ, మారిశెట్టి భాస్కరరావు, కర్రి సన్యాసి అప్పారావు, కర్రి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

హెరిటేజ్ రైతులకు ఏరువాక బోనస్

అచ్యుతాపురం, జూలై 4 : హెరిటేజ్ డెయిరీ రైతులకు రూ.2.32 కోట్ల ఏరువాక బోనస్‌ను విడుదల చేసినట్టు సంస్థ జోనల్ మేనేజర్ వి.దివాకరరావు తెలిపారు. స్థానిక హెరిటేజ్ డెయిరీకి గురువారం వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి మధ్యకాలంలో గల ఆరు మాసాలకు ఈ ఏరువాక బోనస్‌ను రైతులకు ఇస్తున్నట్టు వివరించారు. హెరిటేజ్ సంస్థ లాభాపేక్ష కాకుండా రైతుల ఆర్థికాభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వారిని అన్నింటా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ పి.తులసీనాయుడు, మేనేజర్ కూండ్రపు శేషు తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథస్వామి ఉత్సవ కమిటీ ఏర్పాటు

అనకాపల్లి టౌన్, జూలై 4 : జగన్నాథస్వామి ఉత్సవ కమిటీ నియామకమైంది. అధ్యక్షునిగా దాడి బుజ్జి, సభ్యులుగా బొందా రాజేష్, బుగత కోటేశ్వరరావు, అనకాపల్లి మోహనరావు, వై. ధనలక్ష్మి, బి.వెంకటచలపతిరావు, బి.లక్ష్మి, అప్పారావు నియామకమయ్యారు. వీరిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తన కార్యాలయంలో సత్కరించి అభినందించారు.

వేతనాల కోసం వలంటీర్లు ఆందోళన

సబ్బవరం, జూలై 4 : మండలంలోని ఇరవై సచివాల యాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు చెల్లించాల్సిన గౌరవ వేతనాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురు వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుటవారు ఆందో ళన చేపట్టారు. అనంతరం ఎంపీడీవో రామ్మోహనరావుకు వినతి పత్రం అందజేశారు.

'రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించం'

అనకాపల్లి టౌన్, జూలై 4 : రోగుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందినా ఉపేక్షించేది లేదని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం వైద్యాలయం సమావేశ మందిరంలో వైద్యులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యాలయానికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారికి మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. ఆపరేషన్‌ల విషయంలో గాని, గైనిక్ విభాగంలో గాని రోగుల పట్ల అమర్యాదగా వ్యవహరించినా లేదా వారి నుంచి ఏ విధమైన ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తప్పవన్నారు. వైద్యాలయంలో పనిచేస్తున్న నాల్గో తరగతి సిబ్బంది కూడా విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్ఎంవో గౌతమ్‌తో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జీవో 117ను రద్దు చేయాలి'

ఎస్.రాయవరం, జూలై 4 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు కోరారు. గురువారం మండలంలో ఫెడరేషన్ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో విద్యను రెండు మీడియంలలో కొనసాగించాలని, అన్ని ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని, తెలుగు పండిట్‌లకు పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 2019కు ముందు ఉన్నట్టు మూడు, నాలుగు, ఐదు తరగతులను మళ్లీ పునరుద్ధరించాలని కోరారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ ధర్మారావు, ఉపాధ్యక్షుడు పీవై శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షుడు జి.సునీల్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తోటాడ ఉప సర్పంచ్‌గా కోట్ల హేమ

మునగపాక (తుమ్మపాల), జూలై 4 : తోటాడ ఉప సర్పంచ్‌గా కోట్ల హేమను పాలకవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సచివాలయంలో జరిగిన పాలకవర్గం సమావేశంలో తీర్మానం చేశారు. ఇంతవరకు ఉప సర్పంచ్ పదవిలో కొనసాగిన కొత్తలంక లక్ష్మి గతంలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు తన పదవిని వదులుకోగా, ఒకటో వార్డు మెంబర్ కోట్ల హేమను పాలకవర్గం ఎన్నుకుంది.

నర్సీపట్నం నియోజకవర్గం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్



నాతవరంలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, విద్యార్థులు

నాతవరం, జూలై 4 : మండల కేంద్రంలో గురువారం ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. నీట్ పేపర్లు లీకేజీలకు నిరసన, అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలుకు వ్యతిరేకంగా విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాతవరం హైస్కూల్ విద్యార్థులు ర్యాలీగా తరలివచ్చి మండలకేంద్రం నాతవరం మెయిన్‌రోడ్డులో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, రాజేష్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండలఅధ్యక్షుడు జ్ఞానేష్ మాట్లాడుతూ నీట్ పరీక్షలు స్కామ్ చేశారన్నారు. దీంతో ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం అయిందన్నారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ వల్ల నీట్ పరీక్ష కాకుండా ఇతర పరీక్షలు కూడా టీకేజీకి ఎన్‌టీఏ ఉపయోగపడుతుందన్నారు. నీట్ పరీక్ష వల్ల నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రవి, సెక్రటరీ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాకవరంపాలెంలో ఎస్ఎఫ్ఐ ధర్నా

హుండీ ఆదాయం రూ.2.24 లక్షలు

నర్సీపట్నం, జూలై 4 : బలిఘట్టంలోని శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2,24,207 వచ్చిందని దేవదాయశాఖ ఈవో కిల్లాడ దివ్యతేజ తెలిపారు. గురువారం సూపర్‌వైజర్ కేబీ ఆశా కిరణ్మయి, భక్తులు సమక్షంలో హుండీ తెరిచి భక్తులు స్వామి వారికి కానుకలు లెక్కించామని తెలిపారు.


కృష్ణాదేవిపేటలో అల్లూరికి నివాళి అర్పిస్తున్న సీపీఐ, జనసేన నేతలు


నాతవరంలో నివాళులు అర్పిస్తున్న అప్పలనర్స తదితరులు

మన్యం వీరుడికి ఘన నివాళి

వాడవాడలా అల్లూరి జయంతి వేడుకలు

నర్సీపట్నం, జూలై 4 : పట్టణంలో 127వ అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేశ్ ఆధ్వర్యంలో పెద బొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలోఅల్లూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సీనియర్ నాయకుడు సన్యాసిపాత్రుడు, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, కర్రి శ్రీనివాస్, తమరాన శ్రీను, ఏకా శివ తదితరులు పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన అల్లూరి జయంతి కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, కమిషనర్ పూడి రవిబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. బీజేపీ నాయకులు వెలగా జనార్ధన రావు సబ్ కలెక్టర్ కార్యాలయం వెనక భాగంలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమల వేసి నివాళులర్పించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. శాఖా గ్రంథాలయంలో అల్లూరి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిని దమయంతి, త్రిమూర్తులురెడ్డి, విశ్రాంత లైబ్రేరియన్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నాతవరంలో..

నాతవరం : మండల కేంద్రం నాతవరంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహన్ని రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు తన సొంతఖర్చులతో ఏర్పాటు చేయడం దేశభక్తికి నిదర్శనమని జడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని స్థానిక నాయకులతో కలసి ఆమెఅల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2కామిరెడ్డి వరహాలబాబు, వర్తక సంఘం అధ్యక్షులు తూతిక నాగేశ్వరరావు సర్పంచ్ గొలగాని రాణీ, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, మాజీ మున్సబ్ అంకంరెడ్డి రమణ ఉపాధ్యాయులు అంకంరెడ్డి తాతీలు వార్డు మెంబరు రాజు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో..

గొలుగొండ : చీడిగుమ్మల గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని సీపీఐ నాయకులు అల్లూరి విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు మాకిరెడ్డి రామునాయుడు, నేతలు ఎల్‌వీ రమణ, జి.రాధాకృష్ణ, మర్రి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవి పేటలో..

కృష్ణాదేవిపేట : పలు గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలల్లో అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు అర్పించారు. ఏఎల్‌పురం హైస్కూల్, కళాశాల, పాతకృష్ణాదేవిపేట, చోద్యం తదితర గ్రామాల్లో అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, సీపీఐ నాయకులు రామునాయుడు, మేకా సత్యరాయణ, మేకా భాస్కరావు, రాధాకృష్ణ పాతకృష్ణాదేవిపేట సర్పంచ్ పందిరి సత్యంనాయుడు, ఉపసర్పంచ్ సహదేముడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : మండలంలో పలు చోట్ల అల్లూరి జయంతి వేడుకులను ఘనంగా నిర్వహించారు. మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద విగ్రహానికి తహసీల్దార్‌తో పాటు టీడీపీ నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేశారు. తామరం గ్రామంలో తూర్పుసంఘం నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీమోహన్‌రావు, డీటీత శంకర్‌రావు, టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, శేషకుమార్,లాలం రాము, కోసూరి శ్రీనివాసరావు, బాబురావు,అలాగే బిజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మర్రినాయుడు, అంజేనేయులు తదితరులు పాల్గొన్నారు.

8న జాబ్ అప్రెంటిషిప్ మేళా

నర్సీపట్నం, జూలై 4 : కొత్త బయపురెడ్డిపాలెం వంతెన దగ్గర ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయత్రం 5 గంటలు వరకు అప్రెంటిషిప్ మేళా జరుగుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 11 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికేట్లు, రెండు సెట్లు జెరాక్స్ కాపీలు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం, జూలై 4 : ఇన్‌డోర్ సబ్ స్టేషన్ ప్రభుత్వ ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డివిజన్ ఇంజనీర్ వీడీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని ఏరియా ఆస్పత్రి, పోలీస్ స్టేషన్, బొంతువీధి, కొత్త వీధి, తురకబడి, వెలమవీధి, గచ్చపువీధి, అబీద్ సెంటర్ ప్రాంతాలలోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గొలుగొండలో..

గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల విద్యుత్ ఫీడర్‌లో గల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీడీవీ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని గొలుగొండ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి చీడిగుమ్మల మధ్యలో గల గ్రామాలకు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదింటి కల నెరవేర్చలేక పొయె!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణ పనులకు సిద్ధమయ్యారు. లబ్ధిదారుడు ఎంచుకున్న ఆప్షన్ ప్రకారం ఇసుక, సిమెంట్, ఇనుము ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంటుంది. నిర్మాణ పనులు చేపట్టిన లబ్ధిదారులకు వైసీపీ ప్రభుత్వం వీటిని అరకొరగా అందించడంతో అవి సరిపోక పలుచోట్ల నిర్మాణ పనులు ఆగిపోయాయి.కొందరు లబ్ధిదారులు అప్పులు చేసి ఇంటి పనులు చేపట్టినా బిల్లులు మాత్రం అందలేదు.

సగం ఇళ్లు కూడా పూర్తి కాని వైనం

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం పేదలకు గత నాలుగేళ్లలో 56,580 గృహాలు మంజూరు చేసింది. వీటిలో సగం ఇళ్ల నిర్మాణ పనులు కూడా పూర్తికాలేదు. ఇళ్ల నిర్మాణ పనుల కోసం రూ.1,018 కోట్లు మంజూరు చేసినా కేవలం రూ.537 కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో జిల్లాలో జగనన్న కాలనీల్లో కేవలం 22 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేయగలిగారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాల్లో బేస్‌మెంట్ లెవిల్ లోపు 14,730, బేస్‌మెంట్ లెవిల్‌లో 11,039, రూఫ్ లెవిల్‌లో 2,823, రూఫ్ కాస్ట్ దశలో 3,452 నిర్మాణాలు జరిగాయి. సార్వత్రిక ఎన్నికల ముందు వరకు గత ఏప్రిల్ నెల వరకు అక్కడక్కడా ఇళ్ల నిర్మాణ పనులు జరిగినా తరువాత ఎన్నికలు జరగడంతో గత మూడు నెలలుగా పేదల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లాలో ఆగిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వంపైనే లబ్ధిదారుల ఆశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తాము ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయామని, కొత్త ప్రభుత్వం పెండింగ్ బిల్లులను చెల్లించి తమను ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కంప్యూటర్ సైన్స్‌కే డిమాండ్

... 5వ పేజీ తరువాయి

కలిగినవారు లక్షల రూపాయలు పోసి సీట్లు కొంటున్నారు. నగర శివారుల్లోని రెండు కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాలో కంప్యూటర్ సైన్స్ సీటు కావాలంటే తొలుత ఆరు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయలు కట్టాలి. ఆ తరువాత ఏటా రూ.2.25 లక్షల చొప్పున నాలుగేళ్లలో మరో రూ.తొమ్మిది లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే మొత్తం రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షలు అవుతుంది. దానికి పుస్తకాలు, రవాణా, ఇతరత్రా ఖర్చులు అదనం. మరో రెండు కళాశాలల్లో డొనేషన్లు, నాలుగేళ్ల ఫీజు కలిపి రూ.10 లక్షల నుంచి రూ.11 లక్షలు అవుతుందని గాజువాకకు చెందిన దాసరి సురేంద్ర అనే పేరెంట్ వెల్లడించారు. పొరుగు జిల్లాలో ప్రముఖ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీటుకు రెండు లక్షలు డొనేషన్ చెల్లించామని తగరపువలసకు చెందిన వెంకట్ అనే పేరెంట్ వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే తీసుకుని సీట్లు కేటాయించాలన్న నిబంధనను ఏ ఒక్క కళాశాల యాజమాన్యం పాటించడం లేదని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ కాకుండా మిగిలిన బ్రాంచీలకు పెద్దగా డిమాండ్ ఉండడం లేదు. ఏయూలో మాత్రం కంప్యూటర్ సైన్స్ తరువాత మిగిలిన బ్రాంచీల్లో చేరేందుకు విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు ఇస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ కాకుండా ఇతర బ్రాంచీల విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఐటీ రంగంలో ఉద్యోగం పొందాలంటే కంప్యూటర్ సంబంధిత కోర్సులు చేయాల్సిందేనని ఐటీ కన్సల్టెంట్ నిపుణుడు నరసింహారావు వ్యాఖ్యానించారు. ఐటీ రంగంలోనే భారీ ఉద్యోగాలు ఉన్నందున ఎక్కువ మంది కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో చేరుతున్నారని, ఈ ట్రెండ్ రెండున్నర దశాబ్దాల నుంచి కొనసాగుతుందన్నారు. గడచిన రెండు, మూడేళ్ల నుంచి కంప్యూటర్ సైన్స్‌తో పాటు అందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటాసైన్స్ కోర్సులు వచ్చాయన్నారు.

ఎక్కువ ఉద్యోగావకాశాల వల్లే..

- ఆచార్య వెంకటరావు,
కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి,
ఏయూ ఇంజనీరింగ్ కళాశాల

ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. పేరున్న కళాశాలల్లో సీటు కోసం లక్షలు వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం ఐటీలో కొంత స్లంప్ ఉన్నా...ఇప్పటికీ ఈ రంగంలోనే ఎక్కువ ఉద్యోగాలు దొరుతుతున్నాయి. తొలుత తక్కువ ప్యాకేజీతో చేరినా తరువాత అనుభవం, కొత్త కోర్సులు నేర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటోంది. ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు కొత్త అంశాలను నేర్చుకునే దిశగా ప్రయత్నించి పోటీతత్వం అలవర్చుకుంటే బ్రాంచి ఏదైనా ఫర్వాలేదు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీకి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

నర్సీపట్నం, జూలై 4 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కోసం ఈ నెల 2 నుంచి పదో తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ నెల 11 నుంచి 15 తేదీ వరకు వెబ్ ఆప్షన్స్, 19న సీట్లు కేటాయింపు ఉంటుందని తెలిపారు. గ్రాడ్యుయేషన్‌లో బీఏ పొలిటికల్ సైన్స్ 40 సీట్లు, బీఏ హిస్టరీ 40 సీట్లు, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ 60, బీఎస్సీ బోటనీ 40, బీఎస్సీ కెమిస్ట్రీ 40, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ 60, బీఎస్సీ ఫిజిక్స్ 40 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పీజీ కోర్సుల్లో ఎంకామ్ 40 సీట్లు, ఎంఎస్సీ అర్గానిక్ కెమిస్ట్రీ 40, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ 20 సీట్లు ఉన్నాయని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఆన్‌లైన్ విధానంలో



జరుగుతున్నందున ఆసక్తి గల విద్యార్థులు రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్స్ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చోడవరం నియోజకవర్గం

వేతనాలు పెంచాలని అంగన్‌వాడీల వినతి


ఎమ్మెల్యే రాజుకు సమస్యలు వివరిస్తున్న అంగన్‌వాడీలు

చోడవరం, జూలై 4 : ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో పనిచేస్తున్న తమకు కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం వేతనాలు పెంచేలా చూడాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు హెల్పర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

భూ ఆక్రమణదారులపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

బుచ్చెయ్యపేట, జూలై 4 : మండలంలోని రాజాం రెవెన్యూ సర్వే నెంబరు 328లో భూ ఆక్రమణలపై వీఆర్వో ఆరిపాక తులసీరావు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సర్వే నెంబరులో సుమారు రూ.కోటి విలువైన ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను గత నెల 20న పోలీసుల బందోబస్తు మధ్య రెవెన్యూ ఉద్యోగులు తొలగించారు. అంతేకాకుండా హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. కానీ బుధవారం సదరు భూములను పరిశీలించగా పాతిన హెచ్చరిక బోర్డు పీకేసి, మొక్కలు నాటి ఉండడాన్ని వీఆర్వో గుర్తించారు. గత భూ ఆక్రమణదారులే తిరిగి ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని మొక్కలు పాతారని, తహసీల్దార్‌కు అందజేసిన ఫిర్యాదులో వీఆర్వో పేర్కొన్నారు.

గెడ్డ పోరంబోకు ఆక్రమణపై ..

రోలుగుంట, జూలై 4 : కుసర్లపూడి వెల్‌నెస్ కేంద్రం పక్కన ఉన్న నాలుగు సెంట్ల గెడ్డ పోరంబోకు భూమి కబ్జా చేస్తున్నారని, అడ్డుకోవడంతో తమపై దాడులకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన సబ్బవరపు పూర్ణ గురువారం ఎస్ఐ సురేష్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

కె.కోటపాడు, జూలై 4 : సీజనల్ వ్యాధుల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని ఎంఈఓ-2 డీవీడీ ప్రసాద్ సూచించారు. రొంగలినాయుడుపాలెం ఎంపీపీ పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులతో పాటు మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ అంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. హెచ్ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం సందర్శన

చోడవరం, జూలై 4 : ఇక్కడి కొత్తూరు బాలికల హైస్కూల్‌లో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్‌టు టూల్ శిక్షణ శిబిరాన్ని గురువారం సమగ్రశిక్షా రాష్ట్ర పరిశీలకులు ప్రొఫెసర్ భాగ్యశ్రీ పరిశీలించారు. సమగ్రశిక్షా సాహితీ కో-ఆర్డినేటర్ శకుం తల, జిల్లా సైన్స్ అధికారి కాళిదాసు, జిల్లా సాల్ట్ కో-ఆర్డినేటర్ నీతికా, ఎంఈవోలు జయలక్ష్మి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అల్లూరి

» జయంత్యుత్సవంలో ఎమ్మెల్యేలు బండారు, పంచకర్ల


దేవరాపల్లిలో అల్లూరి చిత్రపటం వద్ద ఎమ్మెల్యేలతో పాటు కూటమి శ్రేణులు నివాళి

దేవరాపల్లి, జూలై 4 : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని, ఆయన స్ఫూర్తితో అంతా మెలగాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. అల్లూరి జయంతి సందర్భంగా దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అల్లూరి పోరాట పటిమను కీర్తించారు. మాజీ ఎంపీపీ భాస్కరరావు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కృష్ణ, శ్రీరాం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : అల్లూరి సీతారామరాజు జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహసీల్దార్ వేణుగోపాలరావు, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, ఎలక్షన్ డీటీ నారాయణరావు, ఆర్ఐ గిరి. రెవెన్యూ సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని గోవాడలో గురువారం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డుసభ్యులు ఏడువాక చిన్నంనాయుడు, సరకాన సన్నిబాబు, నక్కా శ్రీను, రాము, త్రినాథ్, సేనాపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


చోడవరం మండలం గోవాడ..., రావికమతం మండలం కొత్తకోటలో...

బుచ్చెయ్యపేట: స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం వడ్డాది జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ అన్నపూర్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు జేఎస్ఎస్ ప్రభ, నారిబాబు, విజయకుమార్, నర్సింహమూర్తి, సుధీర్, అచ్చియ్యమ్మ, సునీత, ముత్యాలమ్మ, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలోని బుచ్చెంపేటలో అల్లూరి జయంతిని జరిపారు. నాయకులు అనిమిరెడ్డి రమణ, కర్రి రామునాయుడు ఆధ్వర్యంలో పలువురు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అల్లూరి జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్ఎం చంద్రశేఖర్, కార్యదర్శి శేఖర్, నవతరం యూత్ కర్రి వెంకటరమణ, శ్యామల, రాజునాయుడు పాల్గొన్నారు.

రావికమతం : అల్లూరిని అంతా ఆదర్శంగా తీసుకోవాలని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా ఇక్కడి హైస్కూల్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తలుపులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల : మండల కేంద్రం మాడుగులలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రఘుపాత్రుని ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, ఎంపీటీసీలు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బస్టాండ్ ఆవరణంలో గల సీతారామరాజు విగ్రహానికి సర్పంచ్ యడ్ల కళావతి, మాజీ సర్పంచ్ సూర్యారావు భీమరశెట్టి పైడియ్యనాయుడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


వడ్డాదిలో మోహనరంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న తాతయ్యబాబు

ఘనంగా 'వంగవీటి' జయంతి


రైవాడ శివారు బేతపూడి సమీపంలో రంగా విగ్రహావిష్కరణలో బండారు, పంచకర్ల

దేవరాపల్లి, జూలై 4 : ప్రజా నాయకుడు, కార్మిక, కర్షకుల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని మాడుగుల, పెందుర్తి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండలంలోని రైవాడ శివారు బేతపూడి సమీపంలో వాండ్రాసి సింహాచలంనాయుడు, వంగవీటి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోహనరంగా విగ్రహాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. రంగా కార్మికులు, కర్షకుల సమస్యలపై రాజీలేని పోరాటం సాగించారని కీర్తించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, జనసేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ, గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, గుమ్మడి శ్రీరాం, సర్పంచ్ చల్లా లక్ష్మి, వంగవీటి యువసేన నాయకులు రామునాయుడు, హరి, వెంకటరావు, గణేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వంగవీటి మోహనరంగా జయంతిని వడ్డాదిలో గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, దొండా నరేష్, సాయం శేషు, దొండా గిరిబాబు, తలారి శంకరరావు, మంచాల గోవిందరావు, దొండా వెంకటరమణ,బత్తుల కన్నబాబు, ఎ.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

చోడవరం/బుచ్చెయ్యపేట/రోలుగుంట/రావికమతం/మాడుగుల/కె.కోటపాడు/దేవరపాల్లి/ చీడికాడ , జూలై 4 : నీట్ నిర్వహణలో అక్రమాలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన బంద్ పట్టణంలో విజయవంతం అయింది. ఈ సందర్భంగా ప్రైవేటు విద్యాసంస్థలు మూతపడ్డాయి. ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య, నవయువ సమాఖ్యల ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం కొత్తూరు జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేయడంతో పాటు, ఈ పరీక్షల్లో అక్రమాలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌వో జిల్లా నాయకులు మౌనిక, బి.రాజేష్, నవయువ సమాఖ్య నేతలు కె.రామకృష్ణ, టి. అర్జున్ వంశీ, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, బుచ్చెయ్యపేట,రోలుగుంట, రావికమతం, మాడుగుల, కె.కోటపాడు, దేవరపల్లి, చీడికాడ మండలాల్లో విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి.

మాడుగుల నియోజకవర్గం

చెరకుపల్లి బాలుడికి మలేరియా

» వైద్య పరీక్షలలో నిర్ధారణ

చీడికాడ, జూలై 4 : చెరకుపల్లి గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి గురువుల నవీన్‌కుమార్‌కు మలేరియా వ్యాధి సోకినట్టు కోనాంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో నిర్ధారణ జరిగింది. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 25మందికి పరీక్షలు జరిపి మందులు అందజేశామన్నారు. మలేరియా వ్యాధి సోకిన నవీన్‌కుమార్ మాడుగుల మండలం నర్సయ్యపేట పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడన్నారు. ఇతడికి జ్వరం రావడంతో ఉపాధ్యాయులు చెరకుపల్లిలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారన్నారు. దీంతో ఇక్కడికి తీసుకు రాగా ఆశా వర్కర్ ఇచ్చిన మందులను వేస్తున్నా సదరు బాలుడికి జ్వరం తగ్గలేదన్నారు. కోనాంలో జరిగిన వైద్య శిబిరంలో రక్తపరీక్షలు నిర్వహించగా మలేరియా సోకినట్టు తేలిందన్నారు. దీంతో అవసరమైన మందులు అందించి, ఆరోగ్య సూత్రాలను పాటించాలని సూచించినట్టు చెప్పారు.

గ్రామాల్లో సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన


ఖండివరంలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు

చీడికాడ, జూలై 4 : సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈఈ రమణమూర్తి తెలిపారు. ఖండివరం, జేబీపురం, పెద గోగాడ గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన పరిశీలించారు. వీటి నాణ్యతపై ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఈ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ శాఖ ఏఈ శరగడం పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.